APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక

09-04-2026
గురువారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 166
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:
https://epaper.expresstelugudaily.com




నాదర్‌గుల్ భూముల్లో వాటా రానందుకే
## హరీశ్‌రావు దుష్ప్రచారం



సీఎస్‌ఆర్ నిధులు ఖర్చు కాదు..
# సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం

కంపెనీలు తమకు నచ్చిన రంగంలో సీఎస్‌ఆర్ నిధులు వినియోగించాలి

వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలి

- నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని స్థానిక అభివృద్ధికి కేటాయించాలి
- ప్రభుత్వం ప్రధానంగా విద్య, వైద్యం, జల వనరుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత
- ఏ రంగాన్ని ఎంచుకున్నా ప్రభుత్వం తరఫున అవసరమైన పూర్తి సహకారం అందిస్తాం
- విద్యాభివృద్ధికి రహేజా సంస్థ రూ.50 కోట్లు, రాంకీ రూ.50 కోట్లు కేటాయించారు
- విద్యపై యశోద ఫౌండేషన్ రూ.10 కోట్ల ఖర్చుకు ముందుకొచ్చింది

సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రే వంత్ రెడ్డి అన్నారు. సీఎస్‌ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధుల తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్‌ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాల న్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధా న్యం ఇస్తుందని తెలియజేశారు. 2

వేసవిలో తాగునీటి సరఫరాలో
## అంతరాయం ఉండొద్దు

- ఉపాధి వేతనాల బకాయిలను కేంద్రం విడుదల చేయాలి
- పెసా చట్టం అమలుకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క




జనగణన నమోదు
## చాలా సులువు

- ఇంట్లో నుండే డిజిటల్ విధానంలో వివరాలను నమోదు చేసుకునే అవకాశం
- ఈ విధానంలో జనగణన నిర్వహించడం శుభపరిణామం
- భారత అభివృద్ధిని మరింత వేగవంతం చేసి, వికసిత భారత్ లక్ష్య సాధనకు దోహదపడుతుంది
- కేంద్ర మంత్రి బండి సంజయ్

2

పెట్టుబడులు రావొద్దనేదే
## బీఆర్ఎస్ ఉద్దేశం

- ప్రజలను తప్పదోవ పట్టించేలా యాత్రలు చేపడుతుంది
- వికారాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకపోతున్నారు
- రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు : మంత్రి శ్రీధర్‌బాబు

2




## ఆదిలాబాద్‌లో అతిపెద్ద విమానాశ్రయం నిర్మాణం



రెండు వారాలు
# సీజ్ ఫైర్

కాల్పుల విరమణకు ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ అంగీకారం

- విరమణ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ఇరాన్, లెబనాన్, గల్ఫ్ దేశాల్లో మళ్లీదాడులు
- ఇరాన్‌కు ఆయుధాలిచ్చే దేశాలపై 50శాతం టారిఫ్‌లు: ట్రంప్

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పశ్చిమాసియా యుద్ధానికి తాత్కాలికంగా తెరపడింది. రెండు వారాల కాల్పుల విరమణకు ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించాయి. ఇరాన్ నాగరికతను నాశనం చేస్తానన్న తన హెచ్చరికల నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గడానికి వీలు కల్పించిన చివరి..

మిగతా 2లో...



అబద్ధాలతో అధికార పార్టీ..
# నిద్రమత్తులో బీఆర్ఎస్ పార్టీ

- రాష్ట్ర పాలన మొత్తం ఢిల్లీ నుంచే జరుగుతోంది
- కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారింది
- ఈ నెల 25న తెలంగాణ చరిత్రను మార్చే పార్టీ వస్తుంది
- కొత్త నెత్తురు, కొత్త రాజకీయంతో తెలంగాణ భవిష్యత్తును మారుస్తాం
- ఆరోజున అద్భుతమైన ఎజెండా ప్రకటిస్తాం

2



## కోవిడ్‌సమయంలో ప్రభుత్వ వైద్యుల సేవలు మరువలేనివి

- తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చాం
- రూ.3వేల కోట్లతో ఉస్మానియా నిర్మాణం చరిత్రలో మైలురాయిగా నిలుస్తోంది
- రెండు సంవత్సరాల్లో ఆరోగ్య శాఖలో 10,327 నియామకాలు భర్తీ చేశాం
- భవిష్యత్తులో డాక్టర్లకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- మంత్రి దామోదర రాజనరసింహ



## పెట్టుబడులు రావొద్దనేదే బీఆర్ఎస్ ఉద్దేశం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రైతుల దీక్షకు సంఘీభావం పేరిట బీఆర్ఎస్ అనవసర రాజకీయాలు చేస్తున్నదని.. పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకునేలా ప్రజలను తప్పుదోవ పట్టించేలా యాత్రలు చేపడుతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటనలో పేర్కొన్నారు. ఇది వారికి తగదని సూచించారు. వికారాబాద్ జిల్లాలో జరుగుతున్న భూసేకరణపై.. పనిగట్టుకుని ప్రభుత్వంపై బురద చల్లేందుకే రాజకీయ యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వెనుకబాటుకు గురైన వికారాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకనే మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా మార్చేందుకు తాము అహర్నిశలు కృషి చేస్తున్నామని.. తట్టుకోలేక తమపై బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. పెట్టుబడులు రాకుండా.. యువతకు ఉపాధి దక్కకుండా అసత్యాలను వండి వార్చుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు భూములు అవసరమని.. ఇప్పటికే ఆపరేషన్‌లో ఉన్న చందనవెల్లి, సీతారాంపూర్ తదితర ఇండస్ట్రియల్ పార్కుల్లో కొత్త యూనిట్లకు కేటాయించేందుకు భూములు అందుబాటులో లేవని.. కొన్ని చోట్ల ఉన్నా న్యాయపరమైన వివాదాలు, యాక్సెస్ రోడ్డు అందుబాటులో లేదని తెలిపారు. ఇలాంటి తరుణంలోనే కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ల్యాండ్ బ్యాంక్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించామని వివరించారు. పారిశ్రామికాభివృద్ధిని అన్ని ప్రాంతాలకు విస్తరించాలనే లక్ష్యంతో అన్ని రంగాల్లో వెనుకబడిన వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్, పరిగి తదితర ప్రాంతాలను ఎంపిక చేశామని.. కొడంగల్, కోస్గి, దోమ, పరిగి తదితర ప్రాంతాల కనెక్టివిటీని పెంచేందుకు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు రేడియల్ రోడ్డు, ఆర్ఆర్ఆర్‌ను ప్రతిపాదించామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అవసరమైన మేరకు మాత్రమే భూసేకరణ చేయబోతున్నామని మంత్రి తెలిపారు. భూ సేకరణ చట్టం 2013 ప్రకారం డీపీఆర్‌ను తయారు చేసి, ప్రభుత్వం నుంచి 10ఏ జీవో తీసుకున్న తర్వాతే పరిగి మండల పరిధిలోని రాపోల్, కాడ్లాపూర్‌లో భూసేకరణకు నోటిఫికేషన్‌ను జారీ చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్‌ను టీజీఐఐసీ కోరిందని మంత్రి స్పష్టం చేశారు. భూముల్ని కోల్పోయిన వారికిచ్చే నష్ట పరిహారం విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. చట్టప్రకారం నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ బెనిఫిట్ కింద ఇళ్ల స్థలాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడమే ఎజెండాగా సాగుతున్న బీఆర్ఎస్ కుట్రలో భాగస్వామ్యం కావొద్దని అక్కడి ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

## 2 వారాలు సీజ్‌ఫైర్..

(మొదటి పేజీ తరువాయి)

నిమిషపు ఒప్పందం ఇది. యుద్ధంలో తమదే విజయమని అటు అమెరికా, ఇటు ఇరాన్ ప్రకటించాయి. కాల్పుల విరమణ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ఇరాన్, లెబనాన్, గల్ఫ్ దేశాల్లో బుధవారం మళ్లీ దాడులు జరిగాయి.లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దీన్ని నిరసిస్తూ హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మళ్లీ మూసివేసింది. లెబనాన్‌పై దాడులు ఆపకపోతే ఒప్పందం నుంచి వైదొలుగుతామని హెచ్చరించింది. అమెరికా ఉపాధ్యక్షుడు క్లిష్టమైనదిగా అభివర్ణించిన ఈ ఒప్పందం నీరుగారిపోవడానికి తాజా దాడులు కారణమౌతాయన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఒప్పందంలోని అంశాలపై ఉభయపక్షాలు భిన్న వివరణలు ఇవ్వడంతో కాల్పుల విరమణ ఒప్పందంపై ఇప్పటికీ స్పష్టత లేదు. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలపై రవాణా రుసుము వసూలు చేసే విధానాన్ని అధికారికం చేసుకోవడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని ఇరాన్ తెలిపింది. కానీ ఒప్పందంలోని అంశాలు స్పష్టంగా లేవు. అలాగే చమురు రవాణాకు కీలకమైన ఈ మార్గాన్ని ఉపయోగించడం నౌకలకు సురక్షితమనిపిస్తుందో లేదో కూడా స్పష్టత లేదు. ఈ షరతుకు వేరే ఏ దేశమైనా అంగీకరించిందీ కూడా స్పష్టత లేదు.ఇరాన్ మద్దతు ఉన్న ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లాపై లెబనాన్‌లో ఇజ్రాయెల్ ప్రారంభించిన భూతల దాడులు తాత్కాలికంగా నిలిచిపోతాయని ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించడంలో సాయపడిన పాకిస్థాన్, ఇతర దేశాలు తెలిపాయి. అయితే ఇజ్రాయెల్ మాత్రం లెబనాన్‌లో తమ దాడులు ఆగబోవని స్పష్టం చేయడంతోపాటు బుధవారం బీరుట్‌లో భీకర దాడులను కొనసాగించింది. యుద్ధం ప్రారంభించడానికి అమెరికా, ఇజ్రాయెల్‌కు ప్రధాన కారణాలైన ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాల నిర్మూలన భవిష్యత్తు ఏమిటో కూడా స్పష్టత లేదు. శిథిలాల అడుగున ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వెలికితీయడంలో ఇరాన్‌తో కలసి పనిచేస్తామని ట్రంప్ ప్రకటించగా ఇరాన్ మాత్రం దీన్ని ధృవీకరించలేదు. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం టెహ్రాన్ వీధుల్లోకి వచ్చిన ఇరాన్ పౌరులు అమెరికాకు మరణం, ఇజ్రాయెల్‌కు మరణం అని నినాదాలు చేస్తూ అమెరికా, ఇజ్రాయెల్ జెండాలను తగలబెట్టారు.

**ఒప్పందంపై భిన్న వాదనలు**

ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలసి అమెరికా ప్రారంభించిన యుద్ధాన్ని ముగించడంలో ఇరాన్ ప్రతిపాదించిన 10 అంశాల ప్రణాళిక సాయపడుతుందని ట్రంప్ తొలుత అన్నారు. అయితే అణ్వాయుధ నిర్మాణానికి కీలకమైన యురేనియంను శుద్ధి చేసే ప్రక్రియను ఇరాన్ కొనసాగించడానికి అనుమతిస్తారని సూచిస్తూ పార్సీ భాషలో ఒక ప్రకటన వెలువడగా ట్రంప్ దానిపై వివరణ ఇవ్వకుండానే అది మోసపూరితమైనదని ఖండించారు. హోర్ముజ్ జలసంధి సమీపంలోనే అమెరికా యుద్ధనౌకలు చక్కర్లు కొడుతూ ఉంటాయని కూడా ట్రంప్ సూచించారు. రానున్న రోజుల్లో అది ఉద్రిక్తతకు దారితీసే అవకాశం ఉంది. మరోవైపు యుద్ధాన్ని ముగించడానికి ఇరాన్ చేస్తున్న డిమాండ్లలో ఆ ప్రాంతం నుంచి అమెరికా సైనిక దళాలను ఉపసంహరించుకోవడం, ఆంక్షలను ఎత్తివేయడం, స్తంభింపచేసిన తమ ఆస్తులను విడుదల చేయడం వంటివి ఉన్నాయి. యుద్ధానికి శాశ్వత ముగింపు పలికే అంశంపై ఇస్లామాబాద్‌లో 11న మొదటి విడత చర్చలు ప్రారంభమవుతాయని, ఉపాధ్యక్షుడు వాన్స్ అమెరికా బృందానికి సారథ్యం వహిస్తారని వైట్‌హౌస్ తెలిపింది.

**హెజ్బొల్లాపై యుద్ధం.. ఒప్పందంలోకి రాదు**

ఇరాన్‌తో అమెరికా కాల్పుల విరమణ ఒప్పందానికి బుధవారం ఉదయం మద్దతు పలికిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. హెజ్బొల్లాతో తమ యుద్ధం ఈ ఒప్పందం పరిధిలోకి రాదని తేల్చిచెప్పారు. లెబనాన్‌లో దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ సైన్యం కూడా తర్వాత ప్రకటించింది. అయితే కాల్పుల విరమణకు తాము కట్టుబడి ఉంటామన్న విషయాన్ని హెజ్బొల్లా ధృవీకరించలేదు. ఒప్పందాన్ని కుదిర్చే అవకాశాన్ని మధ్యవర్తులకు ఇవ్వడానికి సిద్ధమని మాత్రం హెజ్బొల్లా తెలిపింది.

**ఇరాన్‌కు ఆయుధాలిచ్చే దేశాలపై 50శాతం టారిఫ్‌లు: ట్రంప్**

ఇరాన్‌తో కాల్పుల విరమణ అనంతరం ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. టెహ్రాన్‌కు ఆయుధాలు సరఫరా చేసే దేశాలపై 50శాతం సుంకాలు విధిస్తానని ప్రకటించారు. ఇరాన్‌కు ఆయుధాలిస్తూ తమ దేశానికి ఉత్పత్తులు ఎగుమతి చేసే దేశాలకు ఈ టారిఫ్‌లు వర్తిస్తాయన్నారు. ఇందులో ఎలాంటి మినహాయింపులు లేవంటూ ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. ఇరాన్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ట్రంప్ ప్రయోజనకరమైన పాలనాపరమైన మార్పుగా అభివర్ణించారు.

## వేసవిలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** వేసవి నేపథ్యంలో వచ్చే రెండు, మూడు నెలలు అత్యంత కీలకమని, ఈ సమయంలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి. గ్రామీణ జల సరఫరా శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా అవసరానికి తగ్గట్టుగా వినియోగించేలా అవగాహన పెంచాలని సూచించారు. బుధవారం సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం అమలు, ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టం అమలు అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, డైరెక్టర్ దివ్య దేవరాజన్, ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, ఇతర ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు వివరించారు. కృష్ణా, గోదావరి బేసిన్ల నుంచి నీటి కేటాయింపులు కొనసాగుతున్నందున ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులు లేవని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సింగూర్, శ్రీశైలం వంటి జలాశయాల్లో తాగునీటి నిల్వలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు నీటి సరఫరా పరిస్థితిపై నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడైనా సోర్స్ పాయింట్లలో కొరత తలెత్తితే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్ లీకేజీలు, సరఫరా లోపాలను త్వరితగతిన సరిదిద్దాలని సూచించారు. 1916 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అందుతున్న ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించాలని, ప్రజల్లో ఈ సేవపై మరింత అవగాహన కల్పించాలని చెప్పారు. నీటి మౌలిక వసతులపై సమగ్ర డేటాను సేకరించి, భవిష్యత్ ప్రణాళికలకు ఉపయోగపడే విధంగా రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు.

## సీఎస్ఆర్ నిధులు ఖర్చు కాదు.. సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల వినియోగంపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజాభివృద్ధికి చేసే వ్యయాన్ని కేవలం ఒక 'ఖర్చు'గా కాకుండా, ప్రభుత్వంతో కలిపి చేసే 'భాగస్వామ్యం'గా చూడాలని కార్పొరేట్ సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్ఆర్ నిధుల వినియోగంపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, కార్పొరేట్ సంస్థల పాత్రను ఆయన వివరించారు.



**ప్రాధాన్యత రంగాలను మీరే ఎంచుకోండి..**

కంపెనీలు సీఎస్ఆర్ కింద చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం ప్రధానంగా విద్య, వైద్యం, జల వనరుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సీఎం స్పష్టం చేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఆసక్తి ఉన్న ఏ రంగాన్నైనా (నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ తదితరాలు) ఎంచుకుని సీఎస్ఆర్ నిధులను వినియోగించవచ్చని సూచించారు. ఏ రంగాన్ని ఎంచుకున్నా ప్రభుత్వం తరపున అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కంపెనీలు స్థానికంగా ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున, తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ భాగాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలని కోరారు.విద్యాభివృద్ధికి రహేజా సంస్థ రూ.50 కోట్లు, రాంకీ రూ.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యపై యశోద ఫౌండేషన్ రూ.10 కోట్ల ఖర్చుకు ముందుకొచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**భవిష్యత్ తరాలపై పెట్టుబడి.. విద్యే**

విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "రాష్ట్రంలోని మొత్తం విద్యార్థుల్లో 44 శాతం మంది హైదరాబాద్ నగరంలోనే ఉన్నారు. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది. ప్రభుత్వంతో పాటు కంపెనీలు భాగస్వామ్యమై చేసే వ్యయంతో.. తెలంగాణ విద్యార్థులను ప్రపంచస్థాయి నైపుణ్యం ఉన్నవారిగా తీర్చిదిద్దగలం. తద్వారా వారు భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకునేలా తయారు చేయవచ్చు" అని ముఖ్యమంత్రి వివరించారు.

**సీఎస్ఆర్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి**

సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం, పర్యవేక్షణ లేనందున.. తమ ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టిందని సీఎం తెలిపారు. ఈ నిధుల సమన్వయం కోసం ప్రత్యేకంగా ఒక ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారిని నియమించినట్లు వెల్లడించారు. కంపెనీల ప్రతినిధులు ఈ అధికారితో సమన్వయం చేసుకుని పనులు చేపట్టవచ్చని సూచించారు.

**ముందుకొచ్చిన దిగ్గజ సంస్థలు.. సీఎం అభినందనలు..**

విద్యాభివృద్ధికి తమ వంతు సాయంగా సీఎస్ఆర్ నిధులను కేటాయించేందుకు పలు దిగ్గజ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

**హర్షం వ్యక్తం చేసిన కార్పొరేట్ ప్రతినిధులు..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ చొరవపై కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సీఎస్ఆర్ నిధుల వినియోగం విషయంలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ ఇలా తమను ప్రత్యక్షంగా సంప్రదించలేదని వారు తెలిపారు. పాఠశాల విద్య, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు తాము ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు.ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షాయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, NAADAM ఫౌండేషన్ నుంచి పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి పాల్గొన్నారు. అలాగే ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అబద్ధాలతో అధికార పార్టీ.. నిద్రమత్తులో బీఆర్ఎస్ పార్టీ

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ చరిత్రను మార్చే, భవిష్యత్తును తీర్చిదిద్దే పార్టీ ఈ నెల 25వ తేదీన వస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆవిర్భావం రోజు అద్భుతమైన ఎజెండా ప్రకటిస్తామని చెప్పారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయంతో తెలంగాణ భవిష్యత్తును మారుస్తామని.. దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు తెలంగాణ జాగృతిలో చేరారు. కవిత వారికి కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాగృతి తరపున ప్రశ్నిస్తాం... పోరాడతాం.. పరిష్కరిస్తామని తెలిపారు. వెలుగుమట్ల తరహాలో ప్రజల్లోనే ఉండి సమస్యలపై పోరాడతామని అన్నారు.




"బీఆర్ఎస్ పార్టీ అచేతన స్థితిలో ఉంది.. నిద్రపోతోంది. గద్వాలలో చేనేత, పత్తి రైతులకు అన్యాయం జరుగుతుంటే కూడా ప్రశ్నించడం లేదు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను వంచిస్తోంది. రాష్ట్రపాలన మొత్తం ఢిల్లీ నుంచే జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారింది. ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తే జోగులాంబ జిల్లాలో తెలంగాణ జాగృతికి మొదటి విజయం దక్కింది. ఎమ్మెల్యే సీట్లలో మొదట గద్వాలలోనే విజయం సాధిస్తామని విశ్వాసం ఉంది. చూస్తుంటే గద్వాల గడీ మీద ఉద్యమకారుల జెండా ఎగురుతుందని అనిపిస్తోంది'' అని కవిత అన్నారు.

## బీఆర్ఎస్‌లోకి మాజీ మంత్రి జీవన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదింపులు జరుపుతున్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డికి కేటీఆర్ బుధవారం స్వయంగా ఫోన్ చేసి మాట్లాడినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, నియోజకవర్గ అంశాలపై చర్చించినట్లు సమాచారం. రేపు మధ్యాహ్నం కేటీఆర్ స్వయంగా జగిత్యాల వెళ్లనున్నారు. అక్కడ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో ముఖాముఖి భేటీ కానున్నారు. ఈ భేటీ సందర్భంగా జీవన్ రెడ్డిని అధికారికంగా బీఆర్ఎస్ పార్టీలోకి కేటీఆర్ ఆహ్వానించనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రాథమిక చర్చలు ముగిసినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, గత కొంతకాలంగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు, సొంత పార్టీ నేతలతో ఉన్న విభేదాల కారణంగా జీవన్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినట్లుగా తెలుస్తోంది. జీవన్ రెడ్డి వంటి బలమైన నాయకుడు పార్టీలోకి వస్తే ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌కు భారీ బలం చేకూరుతుందని గులాబీ శ్రేణులు భావిస్తున్నాయి.

## ఆదిలాబాద్‌లో అతిపెద్ద విమానాశ్రయం నిర్మాణం



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మామునూరు ఎయిర్‌పోర్టుకు మరో మూడు నెలల్లో శంకుస్థాపన చేయాలని భావిస్తున్నట్లుగా కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. తెలంగాణలో ఎయిర్‌పోర్టులపై వస్తున్న అన్ని డిమాండ్లను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. ఫీజబులిటి ఉన్న చోట ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నామన్నారు.

**ఆదిలాబాద్‌లో పెద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణం..**

ఆదిలాబాద్‌లో సైనిక, పౌరుల అవసరాలకు అనుగుణంగా పెద్ద ఎయిర్‌పోర్టు నిర్మించాలని కేంద్రం భావిస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇక్కడ సైన్యానికి శిక్షణతో పాటు సివిల్ ఏవియేషన్ అవసరాల కోసం వాడాలని రక్షణశాఖ మంత్రి చెప్పినట్లు గుర్తుచేశారు. ఈనెల 17న ఆదిలాబాద్ భూముల పరిశీలనకు అధికారులు వెళ్తారని, రక్షణశాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశాక తుది నిర్ణయం తీసుకుంటామని రామ్మోహన్ నాయుడు వివరించారు. ఇక్కడ రక్షణశాఖకు చెందిన 360 ఎకరాల భూమి ఉందని, రాష్ట్రప్రభుత్వం 450 ఎకరాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

**క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని నిర్ణయం..**

భూ సేకరణకు ఎలాంటి ఇబ్బందీ లేదని ఆదిలాబాద్ నేతలు చెపుతున్నారన్నారు. విమానాశ్రయానికి కావాల్సినటువంటి అన్ని అనుకూలతలు ఆదిలాబాద్‌లో ఉన్నాయని ఆయన వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాలోని అంతర్గాం వద్ద ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపించిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

## నాదర్‌గుల్ భూముల్లో వాటా రానందుకే హరీశ్‌రావు దుష్ప్రచారం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** నాదర్‌గుల్ భూముల విషయంలో భారత రాష్ట్ర సమితి నేత హరీశ్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. సర్వే నంబర్ 613లోని భూములను 2014లో మూడు సంస్థలకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసిందని తెలిపారు. భూముల మ్యుటేషన్ జరిగిన 2016లోనూ వారి ప్రభుత్వమే ఉందన్నారు. 2014, 2016లో జరిగిన రిజిస్ట్రేషన్లతో ఈ ప్రభుత్వానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. "హరీశ్ రావు చెబుతున్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభించారు. భూములు పొందిన వారు నాలా కన్వర్షన్ ఇవ్వట్లేదని 2022లోనే సుప్రీంకోర్టుకు వెళ్లారు. వాళ్లు కోర్టుకు వెళ్తే బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. అవి ప్రభుత్వ భూములు అని చెప్పి మేం కౌంటర్ వేశాం. ఆనాడు వాటాల ఒప్పందం చేసుకుని భూములు కట్టబెట్టి ఇవాళ మా మీద నిందలు వేస్తున్నారు. నాదర్ గుల్ భూముల్లో వాటా రాకపోవడంతో హరీశ్ రావు ఇవాళ తెరపైకి తెచ్చారు. ప్రొహిబిటెడ్ భూముల్లో ఈ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో నా కుటుంబ సభ్యులెవరూ లేరు. నా కుటుంబ సభ్యులు ఉన్నారని నిరూపించాలని సవాల్ చేస్తున్నా. వట్టి నాగులపల్లి భూముల్లోనూ హరీశ్ రావు పూర్తిగా దుష్ప్రచారం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివాదాన్ని కూడా ఈ ప్రభుత్వానికి అంటగట్టారు'' అని మంత్రి పొంగులేటి తెలిపారు.



## కోవిడ్‌సమయంలో ప్రభుత్వ వైద్యుల సేవలు మరువలేనివి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలోని ప్రభుత్వ డాక్టర్లు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని, కోవిడ్ వంటి కష్ట సమయంలో వారి సేవలు మరువలేమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అభినందించారు. బుదవారం తెలంగాణ వైద్య భవన్‌లో ప్రభుత్వం వైద్యులు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హజరై ప్రసంగించారు. ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ డాక్టర్లకు అవసరమైన సేవలను ప్రభుత్వం అందిస్తోంది. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చాలని, ఉస్మానియా హాస్పిటల్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని దశాబ్దాలుగా డాక్టర్లు అకాంక్షించారు. వారి ఈ దశాబ్దాల ఆకాంక్షను నెరవేరుస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చామని తెలిపారు. గోషామహల్‌లో 26ఎకరాల్లో సుమారు రూ.3 వేల కోట్లతో అత్యాధునిక ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, ఇది రాష్ట్ర ఆరోగ్య రంగంలో మరో మైలురాయిగా నిలుస్తుందన్నారు. గత రెండు సంవత్సరాల్లో ఆరోగ్య శాఖలో 10,327 నియామకాలు భర్తీ చేశామని, మరో 6 వేలకు పైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రెండు రోజుల కితం 174 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నియామక పత్రాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో డాక్టర్లకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని,డీపీహెచ్, టీవీవీపీలో పనిచేస్తున్న స్పెషలిస్టులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అవకాశాలు ఇచ్చామన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైపెండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలు 15శాతం పెంచినట్లు, బదిలీలు పారదర్శకంగా చేపట్టామని చెప్పారు. కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్ ఇస్తూ డాక్టర్లకు తమకు నచ్చిన పోస్టింగ్ ఎంపిక చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ప్రతి ఒక్కరూ హైదరాబాద్‌లోనే పోస్టింగ్ కావాలంటే ఇవ్వలేమని, ట్రాన్స్‌ఫర్లు, డిప్యుటేషన్లు అంటూ వైద్య సేవలకు ఆటంకం కలిగించవద్దని సూచించారు. హెచ్ఆర్, ఇన్‌ఫ్రా, ఎక్విప్‌మెంట్, డ్రగ్స్, డయాగ్నస్టిక్స్ వంటివన్నీ తామ సమకూర్చినా అంతిమంగా వైద్య సేవలు అందించాల్సింది మీరే అన్నారు. జిల్లాల్లో ఉన్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అందరం కలిసి కృషి చేద్దామని, డాక్టర్ల నిజమైన డిమాండ్లు అన్నీ తాను సానుకూలంగా పరిష్కరిస్తానని, మీరంతా ప్రజలకు సేవలు అందించడానికి సహకరించాలని కోరారు.



# విద్యార్థులను సాహిత్యం వైపు ఆలోచింపజేయడం అభినందనీయం

- కందనెల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా మణిపూసల పుస్తకాల ఆవిష్కరణ
- విద్యార్థులు రచించిన తాటికొండ మణిపూసలు,గాయత్రి మణిపూసలు, కందనెల్లి కవితలు అనే మూడు పుస్తకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- విద్యార్థులు రచనలు చేయడం అనిర్వచనీయం
- తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి




**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఉపాధ్యాయులు విద్యార్థులను సాహిత్యం వైపు ఆలోచింపజేయడం, రచనలు చేసే విధంగా ప్రోత్సహించడం అభినందనీయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు.బుధవారం మండల పరిధిలోని కందనెల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సొంతంగా రచించిన మూడు పుస్తకాలను ఘనంగా ఆవిష్కరించారు.తెలుగు సాహిత్యంలో వడిచర్ల సత్యం సృష్టించిన మణిపూసల కవితా ప్రక్రియలో తాటికొండ అర్చన రాసిన "తాటికొండ మణిపూసలు", బింగి గాయత్రి రాసిన "గాయత్రి మణిపూసలు" 24మంది విద్యార్థులు రచించిన "కందనెల్లి కవితలు "అనే పుస్తకాలను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ..ఉపాధ్యాయులు విద్యార్థులను సాహిత్యం వైపు ఆలోచింప చేయడం, రచనలు చేసే విధంగా తయారు చేయడం అభినందనీయమని అన్నారు.రచనలు చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.కవితలు రాసిన 24 మంది బాలబాలికలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్,ఎంపీడీఓ రతన్ సింగ్, ఎంఈఓ నర్సింగ్ రావు,డీసీసీ అధ్యక్షుడు ధారా సింగ్,గ్రామ సర్పంచ్ భూమె యాదమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వాజిద్,జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చారి,కోట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య,వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి,ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గాజీపూర్ నారాయణ రెడ్డి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ శ్రీలత,రిటైర్డ్ విఆర్ఓ వెంకట్ రెడ్డి,కందనెల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం శివకుమార్, కందనెల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.నర్సిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు,విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.



## నీటి సమస్య తలెత్తకూడదు

### మున్సిపల్ కమిషనర్



**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నందికొట్కూరు పట్టణంలోని అన్ని వార్డులో నీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వేగవంతమైన పరిష్కారం చేయాలని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మున్సిపాలిటీలో శానిటేషన్ లో భాగంగా ఉదయం 5.30 గంటలకు నుండి మునిసిపల్ కమీషనర్ పట్టణంలోని లింగం విధులు,కాలేజీ రోడ్డు,సుబ్బారావు పేట,హౌసింగ్ బోర్డు కాలనీ పర్యటించి అక్కడి కాలనీవాసులు సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ..దోమల నివారణకు ముందస్తుగా క్రొత్తగ 04 పవర్ స్ప్రేలు తెప్పించి పట్టణంలోని అన్ని కాలనీలలో స్ప్రే చేయించడం జరుగుతుంది అన్నారు ప్రతి ఇంటి నుండి డోర్ టు డోర్ కలెక్షన్ కంపల్సరిగా జరగాలన్నారు శానిటేషన్ లోపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా మరియు పట్టణంలోని బోర్ పంపులను రిపేరి చేయాలన్నారు.వేసవి కాలంలో నీటి సమస్యలు తేలేతకుండా చుకోవాలని, ఇంచార్జ్ ఎఈ మనోజ్ రెడ్డిని,శానిటేషన్ సెక్రటరీలు మేస్త్రీలకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు,మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం మజ్జిగ పంపిణీ



**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నందికొట్కూరు ఆర్యవైశ్య సంఘం వారి సౌజన్యముత ఆధ్వర్యంలో శ్రీ వాసవి మాత చలివేంద్రము నందు 08.04.2026 మధ్యానం 12.33 నిమిషములకు చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులైన శ్రీ భీమిశెట్టి జయరామ కృష్ణ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన వీరబొమ్మ నాగ సత్యనారాయణ చేతులమీదుగా ప్రారంభించారు.ఆవోపా అధ్యక్షులు కల్కి శ్రీనివాసులు తెలియజేశారు.అనంతరం మజ్జిగ పంపిణీ దాతను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆవోపా కార్యవర్గ సభ్యులు మరియు ఆర్యవైశ్య సంఘం సభ్యులు బచ్చు శ్రీనివాసులు, సర్విశెట్టి పార్థసారథి, మకాం సుబ్బరావు, బద్రి శెట్టి సురేష్,భీమిశెట్టి మురళీకృష్ణ,మురారి ప్రవీణ్ కుమార్,మాకా రాజశేఖర్,మాలే రాజేషు,బచ్చు వెంకట శేషపని,కలికి శేషయ్య,కొండా శరత్,పవన్ పాల్గొన్నారు.

## ఎంఈఓ నర్సింగ్ రావుకు క్షమాపణలు చెప్పిన తపస్ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ అనిల్

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పెద్దేముల్ మండల విద్యాధికారి నర్సింగ్ రావుకు మండల తపస్ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ అనిల్ బుధవారం క్షమాపణలు(సారీ) చెప్పారు.ఈ మేరకు మండల విద్యాధికారి నర్సింగ్ రావు ఈ విషయమై బుధవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి నర్సింగ్ రావు మాట్లాడుతూ..తనపై పెద్దేముల్ మండల తపస్ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ అనిల్ జనగణన విధుల కేటాయింపులో జరిగిన లోటుపాట్ల గురించి మంగళవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేయగా పలు పత్రికల్లో కథనాలు రావడం జరిగిందన్నారు.ఈ విషయమై బుధవారం పెద్దేముల్ మండల తపస్ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ అనిల్ మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ సమక్షంలో తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలు,అసత్య ఆరోపణలతో లేని విషయాలను కల్పించి వివిధ దినపత్రికలకు పత్రికా ప్రకటనలను ఇచ్చిన దినపత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో తనకు క్షమాపణలు(సారీ) చెప్పారని తెలిపారు.ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు మరల ఎప్పుడు చేయనని, సెన్సస్2027 విధుల్లో భాగంగా 300 మంది టీచర్లలో సుమారు 91 మంది టీచర్లకు డ్యూటీ అలాట్మెంట్ (సర్దుబాటు) చేయడం చాలా కష్టమైన పని అని చెప్పారు. భవిష్యత్తులో మండల విద్యాధికారిపై ఏలాంటి మానసిక క్షోభకు గురిచేసే విధంగా మాటలను అనడం కానీ ,ఇబ్బందులకు గురిచేసే పనులు చేయనని పట్లోళ్ళ అనిల్ తెలిపారని ఎంఈఓ నర్సింగ్ రావు అన్నారు. ఇకముందు విధి నిర్వహణలో ఏలాంటి ఆటంకం కల్గించిన,అనవసరంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అనిల్ తనను కోరడం జరిగిందని మండల ఎంఈఓ నర్సింగ్ రావు తెలిపారు.


**పెద్దేముల్ మండల తపస్ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ అనిల్ వివరణ**

ఇదే విషయమై పెద్దేముల్ మండల తపస్ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ అనిల్ ను వివరణ కోరగా...పత్రికా కథనాల్లో ఎంఈఓ నర్సింగ్రావుపై కథనాలు రావడంతో ఆయన మానసిక క్షోభకు గురికావడం వలన ఆ మానసిక క్షోభ కొరకు మాత్రమే తాను క్షమాపణలు(సారీ )చెప్పడం జరిగిందని, కానీ ఏవైతే ఆరోపణలు తాను చేశానో వాటికి మాత్రం కాదని, వాటికి తాను పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నానని తపస్ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ అనిల్ బుధవారం మీడియా ద్వారా తన వివరణలో తెలిపారు.



## ఆడపిల్ల పెళ్లికి అండగా నిలిచిన సర్పంచ్


### హామీని నిలబెట్టిన గుజ్జరి కిష్టయ్య



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముందుండే నాయకత్వాన్ని మరోసారి చాటుతూ కేసారం గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య ఆడపిల్ల పెళ్లికి ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన లక్ష్మీగారి సుమలత వివాహం సందర్భంగా,ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రూ.25,000 చెక్కును సర్పంచ్ స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా పెళ్లికూతురు తల్లి బందమ్మ, తండ్రి అంతయ్య సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆడపిల్లల పెళ్లిళ్లలో ఎదురయ్యే ఆర్థిక భారం తగ్గించేందుకు ఇలాంటి సహాయం ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతలను కూడా సమానంగా నిర్వర్తిస్తున్న సర్పంచ్ గుజ్జరి కిష్టయ్యపై గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు.పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ,ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం ఆయన నాయకత్వానికి నిదర్శనంగా నిలుస్తోందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు,వార్డు సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## దామగట్ల ప్రగతికి మారుపేరు సర్పంచ్ సుశీలమ్మ

### ఘనంగా సన్మానించిన స్వర్ణ గ్రామ సచివాలయం సిబ్బంది



**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** దామగట్ల గ్రామ అభివృద్ధి ప్రగతికి మారుపేరు సర్పంచ్ సుశీలమ్మ బుధవారం నందికొట్కూరు మండల పరిధిలోని దామగట్లలో గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ పదవీకాలం పూర్తయినందున దామగ ట్ల గ్రామని ఐదు సంవత్సరాలు రాజీ లేకుండా అభివృద్ధి చేసినందున స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ..స్వర్ణ గ్రామ సచివాలయాల పర్యవేక్షణ, సిసి రోడ్లు పనుల నిర్వహణ, మరియు వివిధ అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు.సిమెంట్ రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు,మరియు తాగునీటి సరఫరా వంటి పనులను చేపట్టడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో మాధవరం రత్నం డిప్యూటీ ఎంపీడీఓ వెంకట రంగనాయక్,డిప్యూటీ ఎంపీడీఓ పాండురంగారెడ్డి,స్వర్ణ గ్రామ సచివాలయం సిబ్బంది ప్రజలు ప్రజలు పాల్గొన్నారు.

## గడి పెద్దాపూర్లో ఇందిరమ్మ గృహ ప్రవేశం



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలం గడి పెద్దాపూర్లో పురుషోత్తం సుశీల నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిందన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జి సర్పంచ్ హరిక్రిష్ణ, పంచాయితీ కార్యదర్శి రాములు, ఉపసర్పంచ్ శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సాయిబాబా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, రోషన్,మహేశ్,బెతయ్యా, బలరామ్, బాలప్ప,నాయకులూ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణాలకు రూ.4 కోట్ల 30 లక్షల నిధులు






- బుద్దారం నుండి పెద్దేముల్ తండా కెనాల్ రోడ్డుకు రూ.3 కోట్లు
- బాయిమీది తండా నుండి షాదీపూర్ రోడ్డుకు రూ.1 కోటి 30 లక్షలు
- గ్రామీణ రహదారులతో ప్రజలకు, రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం
- రూ.4 కోట్ల 30 లక్షల అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేసిన
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రహదారుల నిర్మాణాలతో గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు.బుధవారం మండల పరిధిలోని రూ.3 కోట్ల రూపాయల STSDF నిధుల ద్వారా బుద్దారం గ్రామం నుండి పెద్దేముల్ తండా కెనాల్ వరకు నూతన రహదారి నిర్మాణానికి, రూ.1 కోటి 30 లక్షల రూపాయల STSDF నిధుల ద్వారా బాయిమీది తండా నుండి షాదీపూర్ గ్రామం (కర్ణాటక) వరకు నూతన రహదారి నిర్మాణానికి స్థానిక నాయకులతో,అధికారులతో కలిసి శంఖుస్థాపనలు చేశారు.అదే విధంగా పెద్దేముల్ మండల పరిధిలోని కందనెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించారు.ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ..పెద్దేముల్ మండలంలో రహదారుల మౌలిక వసతుల అభివృద్ధికి కీలకంగా రూ.4 కోట్ల 30 లక్షల రూపాయలను వెచ్చించి నూతనంగా బీటీ రోడ్డుల నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేయడం జరిగిందన్నారు.ఈ నూతన రహదారుల నిర్మాణాలతో గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు, రైతులకు సౌలభ్యం కలుగుతుందని అన్నారు.ముఖ్యంగా మండల పరిధిలోని బాయిమీది తండా నుండి షాదీపూర్ గ్రామం(కర్ణాటక) వరకు నూతన రహదారి నిర్మాణం ద్వారా రాష్ట్ర సరిహద్దు గ్రామాల మధ్య అనుసంధానం బలోపేతం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## పెద్దేముల్ మండల అభివృద్ధికి కృషి చేస్తా

- మండల నూతన ఎంపీడీఓగా కే.తిరుమల స్వామి నియామకం
- మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతల స్వీకరణ
- సిబ్బంది సమన్వయంతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా
- నూతన ఎంపీడీఓకు ఘన సన్మానం చేసిన ఏపీఓ నర్సింహులు,ఇతర సిబ్బంది



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పెద్దేముల్ మండల నూతన ఎంపీడీఓగా కే.తిరుమల స్వామి నియామకం అయ్యారు.ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల లనూతన ఎంపీడీఓగా పదవీ బాధ్యతలను స్వీకరించారు.గతంలో తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలంలో సుమారు 2 నెలల పాటు ఎంపీడీఓగా విధులు నిర్వహించి 6 నెలల పాటు లాంగ్ లీవ్ లో వెళ్ళడం జరిగిందని అన్నారు.6 నెలల లాంగ్ లీవ్ అనంతరం ప్రస్తుతం డిప్యూటేషన్ పైనా పెద్దేముల్ మండల నూతన ఎంపీడీఓగా నూతనంగా బుధవారం విధుల్లో చేరడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా పెద్దేముల్ మండల ఎంపీడీఓ కే. తిరుమల స్వామి మాట్లాడుతూ.. పెద్దేముల్ మండల పరిషత్ సిబ్బంది సమన్వయంతో పెద్దేముల్ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.మండల ఎంపీడీఓగా నూతనంగా నియామకం అయినా కే.తిరుమల స్వామిని మండల ఏపీఓ నర్సింహులు ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల ఈసీ కృష్ణ, టీఏ శ్రావణ్ కుమార్, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ కాశి ఉషా,తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ దృక్కోణంలో భారతదేశం నేటి అవసరం




డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారు భారతదేశ చరిత్రలో ఒక మహత్తర మార్పుకు నాంది పలికిన మహానుభావుడు. ఆయన కేవలం రాజ్యాంగ రూపకర్త మాత్రమే కాదు; సమానత్వం, న్యాయం, మానవ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఒక యుగదర్శి,నేటి భారతదేశం ప్రపంచ వేదికపై వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా నిలుస్తున్న ఈ సమయంలో, ఒక ప్రాథమిక ప్రశ్న మన ముందుకు వస్తోంది.ఈ అభివృద్ధి నిజంగా ప్రతి పౌరుడి జీవితాన్ని స్పృశిస్తున్నదా? లేక అది కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైపోతుందా? ఈ ప్రశ్నకు సమాధానం కోసం మనం తిరిగి అంబేద్కర్ గారి ఆలోచనల వైపు చూడాల్సిన అవసరం ఉంది.

అంబేద్కర్ గారి జీవితం ఒక మహత్తర పోరాట గాథ. చిన్నప్పటి నుంచే కుల వివక్షను ఎదుర్కొన్న ఆయన, అదే సమాజాన్ని సమానత్వ దిశగా మార్చాలని సంకల్పించారు. పాఠశాలలో నీళ్లు తాగేందుకు కూడా అనుమతి లేకపోవడం, ఇతరులతో కలిసి కూర్చోనివ్వకపోవడం వంటి అవమానాలు ఆయనలో ఒక ఆవేశాన్ని కలిగించాయి. కానీ ఆ ఆవేశం ప్రతీకారంగా మారలేదు; అది మార్పు కోసం పోరాటంగా మారింది. "విద్యే విముక్తికి మార్గం" అనే సిద్ధాంతంతో ఆయన తన జీవితాన్ని తీర్చిదిద్దుకున్నారు. కొలంబియా యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థల్లో చదివి,

ఆర్థికశాస్త్రం, న్యాయశాస్త్రం, రాజకీయశాస్త్రం వంటి విభాగాల్లో లోతైన అవగాహన పొందారు. ఈ విద్య ఆయనకు కేవలం వ్యక్తిగత విజయాన్ని మాత్రమే ఇవ్వలేదు; సమాజాన్ని విశ్లేషించే శక్తిని ఇచ్చింది. అదే శక్తితో ఆయన భారత సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించి, వాటిని సరిచేయడానికి కృషి చేశారు.

అంబేద్కర్ గారి తత్వశాస్త్రం స్వేచ్ఛ (Liberty), సమానత్వం (Equality), సోదరభావం (Fraternity) అనే మూడు సూత్రాలపై ఆధారపడింది. ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు హక్కు కాదు; ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉండాలి. "Political democracy cannot last unless there lies at the base of it social democracy" అనే ఆయన హెచ్చరిక నేటికీ సమానంగా ప్రాసంగికం.

చట్టాలు మరియు సంస్కరణలు - సమసమాజ నిర్మాణానికి పునాది

భారత రాజ్యాంగ రూపకర్తగా బిఆర్ . అంబేద్కర్ గారు ప్రతి పౌరుడికి మౌలిక హక్కులు కల్పిస్తూ, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలకు బలమైన పునాది వేశారు. రాజ్యాంగం ఆయన దృష్టిలో కేవలం చట్టపరమైన పత్రం కాదు; అది సమాన సమాజ నిర్మాణానికి మార్గదర్శక గ్రంథం. విద్య హక్కు సామాజిక న్యాయానికి ప్రధాన సాధనమని భావించిన ఆయన, అణగారిన వర్గాలకు విద్యా అవకాశాలు కల్పించే విధానాలను రూపొందించారు. విద్య ద్వారా వ్యక్తిలో ఆత్మవిశ్వాసం పెరిగి, సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని ఆయన విశ్వసించారు.

రిజర్వేషన్ల వ్యవస్థ ద్వారా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించారు. ఇది చారిత్రక అన్యాయాలను సరిదిద్దే ఒక శక్తివంతమైన సాధనంగా మారింది. సర్వసామాన్య ఓటు హక్కు ద్వారా ప్రతి వయోజన పౌరుడికి రాజకీయంగా సమాన హక్కులు కల్పించారు. "ఒక్కో ఓటు - ఒక్కో విలువ" అనే సూత్రంతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారు.

అంటరానితనం నిర్మూలన కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 17ను ప్రవేశపెట్టి, సామాజిక వివక్షకు చట్టపరమైన అడ్డుకట్ట వేశారు. చట్టం ముందు ప్రతి వ్యక్తి సమానమనే సూత్రాన్ని స్థాపించి, న్యాయ వ్యవస్థను బలోపేతం చేశారు.

మత స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ హక్కులు, వ్యక్తిగత స్వాతంత్ర్యం వంటి మౌలిక హక్కులను రక్షించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను బలపరిచారు. అలాగే అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించి, వారి స్వరాన్ని పాలనలో ప్రతిబింబపజేశారు.

కార్మిక హక్కుల విషయంలో ఆయన చేసిన కృషి అపారమైనది. 8 గంటల పనిదినం, ఫ్యాక్టరీ చట్టాల బలోపేతం, కార్మికులకు రక్షణ వంటి సంస్కరణలు తీసుకువచ్చారు. మహిళల సాధికారత కోసం హిందూ కోడ్ బిల్ ద్వారా ఆస్తి హక్కులు, పునర్వివాహ హక్కులు వంటి అంశాలను ప్రతిపాదించారు. ప్రసూతి ప్రయోజనాల ద్వారా మహిళలకు గౌరవప్రదమైన ఉద్యోగ వాతావరణం కల్పించారు. ఆర్థిక రంగంలో కూడా ఆయన దూరదృష్టి కనిపిస్తుంది. కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థ అవసరాన్ని వివరించి, రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా స్థాపనకు భావనాత్మక పునాది వేశారు. నీటి వనరుల అభివృద్ధి, పరిశ్రమల విస్తరణ వంటి అంశాలపై ఆయన సూచనలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయి. "Educate, Agitate, Organize" అనే సిద్ధాంతంతో ప్రజల్లో చైతన్యం నింపి, విద్య ద్వారానే సమానత్వం సాధ్యమని నమ్మకం కలిగించారు.

**సమసమాజ నాయకుడు**

సమసమాజ నాయకుడిగా ఆయన ఎందుకు నిలిచారంటే, ప్రతి మనిషికి సమాన హక్కులు కలగాలనే ఆయన అచంచల నమ్మకం. లింగ, జాతి, మత, వర్గ భేదాలు లేకుండా ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కలగాలని ఆయన జీవితాంతం పోరాడారు. ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఓటు హక్కును ప్రతి వయోజన పౌరుడికి అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. "ఒక్కో ఓటు - ఒక్కో విలువ" అనే సూత్రంతో ప్రజాస్వామ్యాన్ని ప్రజల చేతుల్లోకి తీసుకువచ్చారు. ప్రజలే పాలకులుగా మారాలని, ముఖ్యంగా అట్టడుగు వర్గాల వారు తమ గళాన్ని ధైర్యంగా వినిపించాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టాలు ఉండటం మాత్రమే సరిపోదని, వాటిని ప్రజలు అవగాహనతో వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. హక్కుల కోసం నిరంతర పోరాటం ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో నిలవాలంటే ప్రజలే పాలకులుగా మారాలని అంబేద్కర్ గారు విశ్వసించారు. హక్కులపై అవగాహన, చైతన్యం, న్యాయపరమైన పోరాటం——ఇవే సమసమాజ నిర్మాణానికి అసలు పునాది.

**నవసమాజ దార్శనికుడు –**

నవసమాజ దార్శనికుడిగా ఆయన యువత, విద్యార్థుల పాత్రను అత్యంత కీలకంగా చూశారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నమ్మిన ఆయన, సాధారణ ప్రజలు కూడా నాయకత్వం వహించి చట్ట నిర్మాణ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అసెంబ్లీలు, పార్లమెంట్ వంటి వేదికల్లో సామాన్య ప్రజల ప్రాతినిధ్యం పెరిగినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుందని ఆయన విశ్వసించారు. పేద ప్రజల జీవితాలను మార్చే విధంగా, సమాన అవకాశాలను కల్పించే విధంగా చట్టాలు రూపొందినప్పుడే నిజమైన నవసమాజం నిర్మించబడుతుందని ఆయన స్పష్టం చేశారు యువతకు మార్గదర్శి నవసమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకం. విద్యార్థులు, యువకులు కూడా నాయకత్వం వహించి పాలనలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల ప్రాతినిధ్యం పెరిగినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుందని ఆయన విశ్వసించారు.

**భారతదేశ వాస్తవ పరిస్థితి – అసమానతల సవాళ్లు**

నేటి భారతదేశం అభివృద్ధి చెందుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు ఇంకా అసమానతలను చూపిస్తున్నాయి. ఎస్సి, ఎస్టీ,బీసీ,ఓసి వర్గాల మధ్య విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాల్లో వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, నిరుద్యోగం, పోషకాహార లోపం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి.

కారంచేడు, చుండూరు వంటి సంఘటనలు మన సమాజంలో కుల వివక్ష ఇంకా పూర్తిగా అంతరించిపోలేదని గుర్తుచేస్తున్నాయి.

**యువత పాత్ర – మార్పు దిశగా అడుగులు**

యువత చదువు, అవగాహన, ధైర్యంతో ముందుకు రావాలి. అన్యాయాన్ని ప్రశ్నించాలి. సమాజ మార్పులో భాగస్వాములు కావాలి. అదే అంబేద్కర్ గారి ఆశయం. నిజమైన నివాళి

భారతదేశం నిజమైన ప్రజాస్వామ్య దేశంగా ఎదగాలంటే ఒక మార్పు అవసరం—— సంక్షేమం నుండి సాధికారత వైపు ప్రయోజనాల నుండి హక్కుల వైపు ప్రతినిధిత్వం నుండి నాయకత్వం వైపు అంబేద్కర్ గారికి నిజమైన నివాళి ఆయన విగ్రహాలు కాదు; ఆయన ఆలోచనల ఆచరణ. చివరగా మనం మనల్ని మనమే ప్రశ్నించాలి: మనము ప్రయోజనదారులమా? లేక నాయకులమా? మనము మార్పు కోసం ఎదురు చూస్తున్నామా? లేక మనమే మార్పుగా మారుతున్నామా?

**అంబేద్కర్ దృక్కోణం – నేటి అవసరం**

బిఆర్.అంబేద్కర్ గారి దృక్కోణం నేటి సమాజానికి అత్యంత అవసరమైన మార్గదర్శకం. ఆయన అభిప్రాయం ప్రకారం, సామాజిక సమానత్వం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడదు, ఎందుకంటే కుల, మత, లింగ ఆధారిత వివక్షలు కొనసాగుతున్నప్పుడు ప్రజాస్వామ్యం కేవలం పత్రాలలో మాత్రమే ఉంటుంది. అందుకే ఆయన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూల విలువలను ప్రతిపాదించారు. ఆర్థిక స్వాతంత్ర్యం కూడా ఆయన దృష్టిలో కీలకం, ఎందుకంటే ఆర్థికంగా బలహీనుడైన వ్యక్తి తన హక్కులను పూర్తిగా వినియోగించుకోలేడు; అందువల్ల ఉద్యోగ అవకాశాలు, సరైన వేతనం, వనరుల సమాన పంపిణీ అవసరం. విద్య మరియు నైపుణ్యాభివృద్ధి ద్వారా వ్యక్తి చైతన్యం పెరుగుతుంది అని ఆయన "Educate, Agitate, Organize" అనే నినాదంతో తెలియజేశారు. అలాగే సమాన అవకాశాల కోసం రిజర్వేషన్లు ఒక సాధనంగా ఆయన భావించారు, తద్వారా అణగారిన వర్గాలు అభివృద్ధి చెందగలవు. Constitution of India ద్వారా ప్రతి పౌరునికి హక్కులు కల్పించి, వివక్షను నిరోధించే వ్యవస్థను ఆయన ఏర్పరచారు. నేటి కాలంలో కూడా ఆర్థిక అసమానతలు, డిజిటల్ విభేదాలు, సామాజిక వివక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో అంబేద్కర్ గారి ఆలోచనలు సమాజాన్ని సమానత్వ దిశగా నడిపించే శక్తిగా నిలుస్తున్నాయి.



- కేతవత్ పండరినాథ్
పీహెచ్.డి - పరిశోధకుడు
9705444419

## మిడుతూరు ఎమ్మార్వో కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

- రీ-సర్వే పనులపై కలెక్టర్ సమీక్ష
- పీజీఆర్ఎస్ ఫిర్యాదుల త్వరిత పరిష్కారానికి ఆదేశాలు
- పరిశుభ్రత,రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి



**నంద్యాల,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మిడుతూరు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.కార్యాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలు పారదర్శకంగా,వేగవంతంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఫేజ్ 3, ఫేజ్ 4 కింద ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయిందో అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రీసర్వే పనులు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే పీజీఆర్ఎస్ ( పిజిఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానాన్ని పరిశీలించిన కలెక్టర్,ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు,కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అనంతరం గ్రామపంచాయతీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు సరిగా లేవని గ్రామ ప్రజలు చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న జిల్లా కలెక్టర్, సంబంధిత ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని,సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.





Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com